## ఆర్ఎంపీ క్లినిక్‌లకు షోకాజ్ నోటీసులు


తనిఖీ చేస్తున్న వైద్య సిబ్బంది

నమస్తే ఎఫెక్ట్

ఎదులాపురం, జూలై 2 : ఆదిలాబాద్‌లో కొందరు ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న వైద్యశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా వైద్యసేవలు అందించడాన్ని వివరిస్తూ నమస్తే తెలంగాణలో జూలై 1వ తేదీన ప్రచురితమైన అక్కడ ఆర్ఎంపీలే ఎంబీబీఎస్‌లు కథనానికి జిల్లా వైద్యశాఖ అధికారులు స్పందించారు. పట్టణంలోని శివాజీచౌక్ ప్రాంతంలో అధికారులు రెండు క్లినిక్‌లను తనిఖీ చేసి ఫస్ట్ ఎయిడ్ కేంద్రంలో అందించే సేవల కంటే రోగులను ప్రభావితం చేసే అంశాలను గుర్తించారు. క్లినిక్ నిర్వాహకులు నోటీసులు జారీ చేయడంతో పాటు ఒక్కో క్లినిక్‌కు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. తనిఖీల్లో వైద్యశాఖ సిబ్బంది వెంకట్‌రెడ్డి, రాంప్రసాద్ ఉన్నారు.

## ఉద్యాన నర్సరీల్లో నాణ్యమైన మామిడి మొక్కలు


ఉట్నూర్ ఉద్యాన నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, జూలై 2 :ఐటీడీఏ పరిధిలో ఉద్యాన నర్సరీల్లో నాణ్యమైన మామిడి,అలంకరణ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని ఉద్యాన నర్సరీలో మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో నాలుగు నర్సరీలను ఏర్పాటు చేశారని,ఈ నర్సరీల్లో మార్కెట్ ధరతో పోల్చితే అతి తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో,మంచిర్యాల జిల్లా భీమారంగా, బెల్లంపల్లి, జంబుగాలో ఉద్యాన నర్సరీలు ఉన్నాయని ఇందులో ఒక్కో మొక్క ధరకు రూ.50 మామిడి, రూ.20క్రోటాన్స్ అలంకరణ మొక్కలు, రూ.20మునగ, కరివేపాకు మొక్కలు లభిస్తాయన్నారు. అవసరమైన రైతులు, రైతు సంఘాలకు, ఎన్‌జీవోలకు ఈ మొక్కలు విక్రయించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు ఇతర మొక్కలు కావాలన్న ఉత్పత్తి చేస్తామని స్పష్టం చేశారు. వివరాలకు ఉద్యానవన అధికారి సుధీర్‌కుమార్ 9032313933ను సంప్రదించాలన్నారు.

### కళాశాలను సందర్శించిన జిల్లా మాధ్యమిక విద్యాధికారి

తానూర్, జూలై 2 : నిర్మల్ జిల్లా తానూర్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలు, పాఠ్య పుస్తకాల పంపిణీ, తరగతుల నిర్వహణ గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఉన్నారు.

### దివ్యాంగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

ఎదులాపురం, జూలై 2 : హైదరాబాద్ హయత్‌నగర్ కేంద్రంలో దివ్యాంగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మధునోముల ఒక ప్రకటనలో తెలిపారు. యువ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అన్ని రకాల గల దివ్యాంగులకు కంప్యూటర్, రిటైల్ సేల్స్ కోర్సులపై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడుతాయన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందన్నారు. ఇతర విషయాల కోసం సెల్ నంబర్లు 9032038928, 8919214083ను సంప్రదించాలని సూచించారు.

## నిషేధిత మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా


మాట్లాడుతున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూలై 2: అన్ని శాఖల సమష్టిగా కృషి చేద్దాం.. నిషేధిత మత్తు పదార్థాలను నిర్మూలిద్దామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ, అగ్రికల్చర్, పోలీస్ వివిధ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి యాంటి డ్రగ్ కమిటీలలో పోలీసులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 35 కేసుల్లో 111 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 67 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి పండించే వారిపై కేసులు నమోదు చేసి, ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, ఆర్డీవో వినోద్ కుమార్, సంక్షేమ శాఖ అధికారులు సబిత, సునీతకుమారి, ప్రణీత, రవీందర్,ఎక్సైజ్ సూపరిటెండెంట్ హిమశ్రీ, వ్యవసాయ అధికారి రమేశ్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

### మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎదులాపురం, జూలై 2: వర్షాకాలం దృష్ట్యా మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఏర్పాటు చేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో సీజనల్ వ్యాధు లు, వరదల నివారణకు చర్యలు, లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులకు జిల్లా ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి సూచనలు, సలహాలు చేశారు. దెబ్బతిన్న రోడ్లు, ఇండ్లు గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడునెలలకు సరిపడా సరుకులు, పౌష్టికాహారం తదితర సరఫరా చేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 9440811700కి సంప్రదించాలని సూచించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


నిర్మల్ దవాఖానను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 2: రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య కళాశాల దవాఖానను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. దవాఖానలో అత్యవసర సేవల విభాగం, డయాలసిస్ కేంద్రం, ఇన్‌పేషంట్, ఔట్ పేషంట్ విభాగాలు, ఆరోగ్యశ్రీ వార్డులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను, చికిత్సలకు సంబంధించిన వివరాలను వైద్యులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలందించాలని, సమయపాలన పాటించాలని వైద్యులకు సూచించారు. ఆరోగ్య మిత్ర సేవలు ప్రతి ఫ్లోర్‌లో ఏర్పాటు చేయాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్‌కేర్, ఫిజియోథెరపీ బ్లాక్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన ఇన్‌చార్జి పర్యవేక్షకుడు రవీందర్, వైద్యులు ప్రసాద్, శ్రీనివాస్, దరహాస, నర్సింగ్ సూపరింటెండెంట్లు కమలమ్మ, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

### కడెం గేట్లకు మరమ్మతులు పూర్తి చేయాలి

కడెం, జూలై 2 : కడెం ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. మంగళవారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ప్రాజెక్టును పరిశీలించారు. నీటి మట్టం, ఇన్‌ఫ్లో, గేట్లకు మరమ్మతుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు ఆపరేషన్ సిస్టం, నీటి మట్టం, ఇన్‌ఫ్లో పరిశీలించాలని, ముందస్తు సమాచారాన్ని సమీప గ్రామాల ప్రజలకు చేరవేసి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నాకళ్యాణి, నీటి పారుదల శాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్, ఎస్ఈ రవీందర్, ఈఈ విఠల్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో అరుణ అధికారులున్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి


నిర్మల్ చైన్‌గేట్ : ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, జూలై 2: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. నిర్మల్‌లోని నటరాజ్‌నగర్, బైల్‌బజార్, పంజేషగల్లీ తదితర కాలనీల్లో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇండ్లలోని పలు కుండీల్లో, నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా పలు వ్యాధులు ప్రబలే అస్కారం ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారి రవీందర్‌రెడ్డి, డీపీఎంవో రాజేశ్వర్, జిల్లా మీడియా విస్తరణాధికారి రవీందర్, హెచ్ఈ వేణురావు, ఎస్‌యూవో భోజారెడ్డి, మహేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

దస్తురాబాద్, జూలై 2 : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఇంటి పరిసరాల్లో, ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఎంపీడీవో రమేశ్, డాక్టర్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీవో రమేశ్, డాక్టర్ నాగరాజు పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వీ లలిత, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ, అనిల్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు

భైంసా, జూలై 2 : వివాహితపై అత్యాచారయత్నం చేసిన ఒకరికి జైలు శిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు మంగళవారం తీర్పునిచ్చినట్లు కోర్టు రికార్డు అసిస్టెంట్ చంద్రకాంత్ తెలిపారు. 2018లో కుభీర్‌కు చెందిన గోనిగర్ సాయినాథ్ అదే గ్రామానికి చెందిన వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు కుభీర్ ఎస్ఐ కేసు నమోదు చేయగా, భైంసా కోర్టులో కేసు విచారణ జరిపారు. ఏపీపీ అరుణ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో ఈ మేరకు ఏడాది కఠిన కారాగార శిక్ష రూ. 2500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు.

## అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం


ఎంపీపీ మంజులాశ్రీధర్ రెడ్డి, జడ్పీటీసీ తాటిపల్లి రాజు, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

తాంసి, జూలై 2 : పార్టీలకు అతీతంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరి సహకారంతోనే మండలాభివృద్ధి సాధ్యమైందని జడ్పీటీసీ తాటిపెల్లి రాజు, ఎంపీపీ సురుకుంటి మంజులాశ్రీధర్ రెడ్డి అన్నారు. ఐదు సంవత్సరాల పాటు తాంసి మండల ప్రజలకు సేవలు అందించి రెండు రోజుల్లో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవి కాలం ముగియనుండడంతో మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పాటు మండల ప్రజలకు సేలందించేందుకు సహకరించిన ఎంపీపీకి సర్పంచ్‌లకు, ఎంపీటీసీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీటీసీలను, అధికారులను, ఎంపీపీని, జడ్పీటీసీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, వైస్‌ఎంపీపీ ముచ్చ రేఖ- రఘు, కప్పర్ల ఎంపీటీసీ భాగ్యలక్ష్మి-సంతోష్, తాంసి ఎంపీటీసీ నరేశ్, జామిడి ఎంపీటీసీ అశోక్, సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు సదానందం, బీఆర్ఎస్ మాజీ మండల కన్వీనర్, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్, నాయకులు, బండల్‌నాగపూర్ మాజీ సర్పంచ్ వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పాఠశాలలు తనిఖీ చేసిన డీఈవో

ఎదులాపురం, జూలై 2 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నంబర్-2, ప్రైవేట్ హైస్కూల్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల యూనిఫామ్ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నారాయణ హై స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. ఫీజు వివరాలు ,ఉపాధ్యాయుల విద్యార్హతలు గురించి ఆరా తీశారు.

### అభ్యున్నతికి కార్యవర్గం కృషి చేయాలి

ఎదులాపురం, జూలై 2 : నాయీబ్రాహ్మణ సంఘం అభ్యున్నతికి కార్యవర్గం కృషి చేయాలని సంఘం గౌరవాధ్యక్షుడు అంజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సంఘం భవనంలో పట్టణ కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్‌ను ఎన్నుకోగా రెండు సంవత్సరాల పాటు ఆయన పట్టణ అధ్యక్షుడిగా కొనసాగున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలల శ్రీనివాస్, నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు వేణుగోపాల్, రాము, మందపల్లి శ్రీనివాస్, నర్సన్న, శ్రీకాంత్, రాజు, సచిన్ పాల్గొన్నారు.

# అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

## హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయక పోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్లు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.




### అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీం కోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

### అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

### సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్టు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

### ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

### 'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కెఐవోఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఎల్ఐ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే-ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.


ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారధి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

## హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

### సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య



### వెస్పా స్కూటర్ ధర 14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

## ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

### విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్




న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

### మాల్యాకు ఎన్బీడబ్ల్యూ

ముంబై, జూలై 2: పరారీ వ్యాపారవేత్త విజయ్ మాల్యాపై తాజాగా మరో నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ)కు రూ.180 కోట్ల రుణం ఎగవేశారన్న కేసులో ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఎస్పీ నాయక్ నింబాల్కర్ ఎన్బీడబ్ల్యూకు ఆదేశించారు. 2007 నుంచి 2012 మధ్య మాల్యాకు చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ ఈ రుణాలను తీసుకున్నది.

### సింగరేణి లక్ష్యం 2 లక్షల టన్నుల ఉత్పత్తి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు రోజుకు 2లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి, రవాణా చేయాలని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (మట్టి)ని తొలగించాలన్నారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి సంస్థ డైరెక్టర్లు, ఏరియా జీఎంలతో కలిసి బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టులు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ వంటి అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

## హైదరాబాద్‌లో ఫినోమ్


హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

## టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో రూ.249కి అందిస్తుండగా, ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.379గా ఉన్నది. జియో కస్టమర్లు 9 శాతం తక్కువ ధరకే ఈ ప్లాన్ లభిస్తుండటం విశేషం. మరోవైపు, మూడు నెలల ప్లాన్ విషయానికి వస్తే 6జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్‌ను జియో రూ.479కి అందిస్తుండగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు ఆరు శాతం అధికంగా రూ.509కి అందిస్తున్నాయి. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ జియో ధర రూ.799 ఉండగా, అదే పోటీ సంస్థలైన ప్లాన్లు 8 శాతం ఎక్కువగా రూ.859కి అందిస్తున్నాయి.

## ఫార్మాకు భూముల కొరత!

- ప్రకటించిన మూడు జిల్లాల్లోనూ అడ్డంకులే
- కొత్తగా రెండు ప్రాంతాలు ఎంపిక చేసిన ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన ఫార్మా విలేజ్‌లు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇప్పటికే పలు సమస్యలతో సతమతమవుతుండగా.. తాజాగా భూముల కొరత వెంటాడుతున్నది. నల్గొండ, మెదక్, వికారాబాద్ తదిరత మూడు జిల్లాల్లో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా..ఈ మూడు చోట్ల భూముల లభించే పరిస్థితి లేదని ఆయా జిల్లా కలెక్టర్లు తేల్చిచెప్పారు. అయితే జహీరాబాద్‌లో భూసేకరణ అవకాశం ఉండగా, వికారాబాద్‌లో ల్యాండ్ పూలింగ్ ద్వారా ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని సర్కార్ యోచిస్తున్నది. దీంతో మొదటిదశలో ఈ రెండు ప్రాంతాల్లో ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. సుమారుగా లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో 10 ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ఈ ఫిబ్రవరిలో జరిగిన బయో ఏషియా సదస్సులో ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా వికారాబాద్, మెదక్, నల్గొండ జిల్లాలో 1000 నుంచి 2 వేల ఎకరాల స్థలంలో ఈ విలేజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఫార్మా పరిశ్రమలు కాలుష్యంతో కూడిన రెడ్ జోన్ పరిధిలోకి వస్తాయి కాబట్టి, వీటి ఏర్పాటునకు స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశాలు కూడా ఉండటంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది.

### ఎకోసిస్టం లేకుండా సాధ్యమేనా..

పరిశ్రమల ఏర్పాటునకు సంబంధించి పర్యావరణ వ్యవస్థ(ఎకోసిస్టం) అభివృద్ధి కావడం ఎంతో ముఖ్యం. ఉదాహరణకు రాష్ట్రంలో అనేక దిగ్గజ ఐటీ కంపెనీలు ఉన్నాయి. దీంతో వాటికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో చిన్నాచితకా ఐటీ కంపెనీలు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. ఇటువంటి పర్యావరణ వ్యవస్థ లేకుండా పరిశ్రమల మనుగడ సాధ్యంకాదు. ఫార్మా రంగం విషయానికొస్తే, ఇప్పటికే జీడిమెట్ల, బాలానగర్, శామీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో ఫార్మా పరిశ్రమలు కొలువుదీరాయి. జీనోమ్ వ్యాలీలో అనేక కంపెనీలు తమ పరిశోధన కేంద్రాలను నెలకొల్పాయి.